క్లుప్తంగా

నేడు ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించనున్నారు. కార్మికులను విభాగాలు మార్చడం, పూర్తి జీతాలు చెల్లింపు, హెచ్‌ఆర్‌ఏ చెల్లించడం, కరెంటు బిల్లులు తగ్గించాలని డిమాండ్లపై ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ధర్నా నిర్వహించనున్నారు. యూనియన్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు హాజరు కావాలని సీఐటీయూ నాయకులు కోరారు.

ఘనంగా జాతీయ పతాకావిష్కరణ దినోత్సవం



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: భారతదేశ జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం అగనంపూడి సంత్రం కూడలిలోని మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో పతాకాన్ని ప్రదర్శించారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకాన్ని జూన్ 22న ఆవిష్కరించారని, గుర్తుగా జాతీయ పతాకావిష్కరణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, జగన్నాథస్వామి ట్రస్ట్ చైర్మన్ కరణం పైడిరాజు, నాయకులు కోసూరి తాతారావు, పాయకరావుపేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాజేష్ కన్నా, నగరాల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

అగనంపూడి: అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉక్కు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు జి.బోసుబాబు, బి.భాస్కరరాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గుదే సుశీలా గజేంద్రరావు, ఐ.రామునాయుడు తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వీఎంఆర్ షాపింగ్ మాల్ వెనుక ఉన్న విజయా వెలన్సీ ఫంక్షన్ హాలులో ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉక్కు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు శిబిరాన్ని సద్వినియోగపర్చుకోవాలని వారు కోరారు.

నేటి నుంచి ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

పెదగంట్యాడ: గాజువాక న్యూ ఐటీఐలో ఈ నెల 23 నుంచి 25 వరకూ రెండో విడత ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఏస్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఇప్పటికే ర్యాంక్ వివరాలు, కౌన్సెలింగ్ తేదీ, సమయాలను మెసేజ్ చేశామన్నారు. మెసేజ్ రాని అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

సెక్యులర్, సోషలిజం పదాలను తొలగించడానికి కుట్ర



మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్

సీతంపేట: రాజ్యాంగ సవరణ ద్వారా సెక్యులర్, సోషలిజం పదాలను తొలగించడానికి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ ఆరోపించారు. మంగళవారం రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం గల దేశమని, బీజేపీ 'సెక్యులర్' పదాన్ని తొలగించాలని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తోందన్నారు. ఇది ఒక్క దళితుల సమస్య కాదని, దేశంలోని ప్రజలందరి సమస్యగా గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 26న అంబేడ్కర్ భవన్‌లో జరగనున్న డీహెచ్‌పీఎస్ జిల్లా 5వ మహాసభలను జయప్రదం చేయాలని ప్రభాకర్ కోరారు. ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, వివిధ సంఘాల నాయకులు హాజరవుతారని తెలిపారు. డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజులు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత దళితులందరిపైనా ఉందన్నారు. సమావేశంలో రాంబాబు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఈసారైనా..!

పాలిథిన్ నిషేధం అమలయ్యేనా? | **ప్రకటనలకే పరిమితమవుతున్న అధికారులు** | **యథేచ్ఛగా వినియోగం** | **నిబంధనలను పట్టించుకోని వ్యాపారులు**





డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

స్వర్ణాంధ్ర సాకారం కావాలంటే.. ముందు స్వచ్ఛాంధ్ర సాధించాలి.. ప్లాస్టిక్ బ్యాగ్‌లు, కప్పులు, ప్లేట్లకు గుడ్ బై చెబుదాం.. బదులుగా వస్త్ర సంచులు, కంపోస్టు ప్లేట్లు వాడుదాం.. ఆగస్టు 15 నాటికి రాష్ట్ర సచివాలయాన్ని, అక్టోబర్ నాటికి అన్ని మున్సిపాలిటీలు, డిసెంబర్ నాటికి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తామంటూ స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సీఎం పిలుపు మేరకు జిల్లా యంత్రాంగం కూడా ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. అయితే ఇవి ప్రకటనలకేపరిమితమయ్యేనా.. ఆచరణ సాధ్యమయ్యేనా అంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

– పెదగంట్యాడ

నిషేధిత ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం.. జీవకోటి మనుగడకు పెను ముప్పు అని తెలిసినా ప్లాస్టిక్ నిషేధాజ్ఞలను అమలు చేయడం లేదు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ వినియోగం రోజు రోజుకూ పెరిగిపోతోంది. అయితే ఈసారి ఆగస్టు 15 నుంచి డిసెంబర్ నాటికి సంపూర్ణంగా పాలిథిన్‌ను నిషేధిస్తామని స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు అధికారులకు దిశా నిర్దేశం చేసింది. అందుకు అవసరమైన ప్రచారాన్ని కూడా ప్రారంభించింది.అయితే గతంలో నిషేధం మూణ్నాళ్ల ముచ్చటగా మారడంతో ఈసారైనా అమలయ్యేనా అని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రతలో భాగంగా స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. అయితే ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించి ఫొటోలు తీసుకుని ముగిస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ సంచులను, గ్లాసులను మార్కెట్లో విచ్చల విడిగా విక్రయిస్తున్నారు. ఉదయం బయట నుంచి టిఫిన్, కూరగాయలు తేవాలన్నా.. ఇంటికి సరకులు తీసుకు రావాలన్నా ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. వాటి వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు అని తెలిసినా మారడం లేదు. గుడి, బడి, బజారు, కిరాణా షాపు, హోటళ్లు, మార్కెట్ ఇలా ఎక్కడికి వెళ్లినా ప్లాస్టిక్ కవర్లే దర్శనం ఇస్తున్నాయి. వ్యాపారులు కూడా ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోవడం లేదు. నియంత్రించాల్సిన అధికారులు కాసులకి కక్కుర్తి పడి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మృత్యువాత పడుతున్న మూగజీవాలు

ప్రజలు వినియోగించిన ప్లాస్టిక్ కవర్లను, మిగిలిపోయిన తిండిని కవర్లతో పడేస్తున్నారు.ఆహారంతో పాటు కవర్లు తినేయడంతో పశువుల కడుపులోకి వెళ్లిన ప్లాస్టిక్‌తో అవి మృత్యువాత పడుతున్నాయి.

కఠినంగా వ్యవహరిస్తాం



నిషేధిత ప్లాస్టిక్ కవర్లు తయారు చేసినా, విక్రయించినా కఠినంగా వ్యవహరిస్తాం. నిషేధాన్ని ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తున్నాం. పాలిథిన్‌కు ప్రత్యామ్నాయంగా కాగితంతో తయారు చేసిన, గుడ్డ సంచులను వినియోగించాలని ప్రచార కార్యక్రమాన్ని మొదలు పెట్టాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ కిరణ్ కుమార్, ఏఎంవోహెచ్, జీవీఎంసీ జోన్–6

పెరుగుతున్న వ్యర్థాలు

పాలిథిన్ కవర్లు, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయాలు మండలంలో ఎక్కడపడితే అక్కడ యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రతి రోజూ మండలంలో సుమారు రెండు నుంచి మూడు టన్నుల వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పడుతున్నట్టు అంచనా. గతంలో 40 మైక్రాన్ల తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్ల విక్రయాలపై నిషేధం విధించారు. వాటిని విక్రయించిన వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేయడంతో పాటు జరిమానాలు విధించారు. దీంతో వాటి వినియోగం అప్పట్లో చాలా వరకూ తగ్గింది. పాలిథిన్ కవర్ల వినియోగానికి బదులుగా గుడ్డ సంచులు, నార సంచులు వినియోగించేవారు. తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమక్రమంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం మళ్లీ పెరిగిపోయింది.



చిన నడుపూరు–వుడా డబుల్ రోడ్డులో రోడ్డుపై పడేసి ప్లాస్టిక్ వ్యర్థాలు

నిషేధం పక్కాగా అమలు చేయాలి



పాలిథిన్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి. 40 మైక్రాన్లు కన్నా తక్కువ మందం కలిగిన వాటిని తయారు చేస్తున్న కంపెనీలతో పాటు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి. పాలిథిన్ వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలి. కింద స్థాయి అధికారులు తనిఖీల పేరుతో వ్యాపారులు వద్ద అందినకాడికి దోచుకోని ప్లాస్టిక్ వినిమోగం పెంచే విధంగా వ్యవరిస్తున్నారు. అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకోవాలి.

– గొందేశి వెంకటరమణారెడ్డి, కొరాడ, పెదగంట్యాడ

పాలిథిన్ వాడకంతో క్యాన్సర్ ముప్పు



పాలిథిన్ వాడకం వల్ల క్యాన్సర్ బారిన పడాల్సి వస్తుంది. వేడి ఆహార పదార్థాలు ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయకూడదు. ప్లాస్టిక్‌లోని రసాయనాలు మనిషి శరీరంలో చేరుతాయి. దీంతో పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులు తీసుకుని వెళ్లాలి.ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి హాని కలుగుతుందని పజల్లో కూడా మార్పు రావాలి.

– డాక్టర్ సంపత్ బాబు, వైద్యాధికారి, పీహెచ్‌సీ పెదగంట్యాడ

వంటా వార్పుతో క్లాప్ లోడర్ల నిరసన



వంటా వార్పులో పాల్గొన్న క్లాప్ లోడర్లు, నాయకులు

గాజువాక: తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ క్లాప్ వాహనాల లోడర్లు రెండో రోజు మంగళవారం కూడా ఆందోళన కొనసాగించారు. జీవీఎంసీ కార్యాలయం వద్ద వాహనాల పార్కింగ్ స్థలంలో వంటా వార్పుతో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ లోడర్లకు చాలీచాలని జీతాలు ఇస్తున్నారని, అవి కూడా ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మికులు ఏం తింటారో, ఎలా బతుకుతారో ఉన్నతాధికారులు ఆలోచించాలన్నారు. పిల్లలకు ఫీజులు కూడా కట్టలేని పరిస్థితుల్లో కార్మిక కుటుంబాలున్నాయన్నారు. రెండు నుంచి నాలుగు నెలలపాటు జీతాలు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి కార్మికులకు వెంటనే జీతాలను చెల్లించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నక్క నాగరాజు, ధనరాజు, చంటి, మహేష్, లక్ష్మి, కనక తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని గౌరవించాలి



రంగురంగుల పువ్వులతో జాతీయ పతాకాన్ని గౌరవిద్దాం.. దేశ ప్రజలు గర్విద్దాం ..

పెదగంట్యాడ: జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవాన్ని జీవీఎంసీ 77వ వార్డు చేపలపాలెం ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాక రూపశిల్పి పింగళివెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య జాతీయ పతాకాన్ని రూపొందించి 1921లో విజయవాడలో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో ప్రదర్శించారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది హేమంత్‌కుమార్, ఎస్‌ఎంసీ సభ్యులు ముత్యాలమ్మ, శివకొర్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ కాంట్రాక్టు కార్మికుల పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న కార్మిక కుటుంబాలు, కార్మిక నాయకులు

గాజువాక: విశాఖ డెయిరీలో నిలుపుదల చేసిన 305 మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. విశాఖ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెం వద్ద ప్రారంభమైన పాదయాత్ర జాతీయ రహదారి మీదుగా పాతగాజువాక వరకు కొనసాగింది. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు రాంబాబు మాట్లాడుతూ డెయిరీలో కాంట్రాక్టు కార్మికులను నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగించారన్నారు. డెయిరీ యాజమాన్యం బరితెగించి వ్యవహరిస్తోందన్నారు. సమస్యను లేబర్ అధికారులు, మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. సమస్య పరిష్కారమయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రాజేంద్ర ప్రసాద్, పి.మణి, కె.సంతోషం, ఎస్.రమణ, లోకేష్, దాస్, జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఎస్.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి గాజువాకలోని వివిధ సంస్థల్లో కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి.

స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి శ్రీనివాసరావు విశేష కృషి



కోక్‌ఓవెన్స్ జీఎం శ్రీనివాసరావును సత్కరిస్తున్న విభాగం అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కోక్‌ఓవెన్స్ జనరల్ మేనేజర్ వై.వి.ఆర్. శ్రీనివాసరావు విశేషంగా కృషి చేసారని కోక్‌ఓవెన్స్ విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. శ్రీనివాసరావు ఈనెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా మంగళవారం విభాగంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 180 పుషింగ్స్ ఉత్పత్తి జరిగే సమయంలో శ్రీనివాసరావు కోక్‌ఓవెన్స్‌కు వచ్చి 380 పుషింగ్స్‌కు తీసుకు వెళ్లారని అభినందించారు. రష్యా, జపాన్, ఫిలిప్పీన్స్, టర్కీ దేశాల్లో తర్ఫీదు పొంది మన ప్లాంట్ అభివృద్ధికి ఎంతో చేశారని కొనియాడారు. అనేక అవార్డులు అందుకున్నారన్నారు. ఆయన్ను ఉద్యోగులందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్మినెంట్ కార్మికుల బదిలీలు ఆపాలని వినతి



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ సలీంతో చర్చిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్ కార్మికుల బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు యూనియన్ నాయకులు మంగళవారం డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీం జి పురుషోత్తమన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మెకానికల్ అనుభవం కలిగిన సీనియర్ కార్మికులను బదిలీ చేయడం అన్యాయమన్నారు. మెకానికల్ మెయింటెనెన్స్‌లో అనుభవం కలిగిన కార్మికులను ఆపరేషన్స్‌కు బదిలీ చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. స్టాండింగ్ ఆర్డర్స్‌కు వ్యతిరేకంగా కార్మికుల బదిలీలు జరిగాయన్నారు. బదిలీలను ఆపడంతో పాటు భవిష్యత్తులో బదిలీలపై కార్మిక సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు, ప్రధానకార్యదర్శి డి.ఆదినారాయణ, నాయకులు చీకటి శ్రీనివాస్, టి.సత్యనారాయణ, దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తాజుద్దీన్‌బాబా చందనోత్సవం



చాదర్ సమర్పిస్తున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని హైవేకు సమీపంలో ఉన్న తాజ్‌బాగ్ దర్గాలో మంగళవారం హజరత్ తాజుద్దీన్ బాబా 72వ చందనోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకలో భాగంగా, అక్కయ్యపాలెం తాజ్‌బాగ్ నుంచి కోటవీధిలో ఉన్న హజరత్ ఇషాక్ మదీనా ఔలియా దర్గాకు సందల్ ఊరేగింపు బయల్దేరింది. అక్కడి నుంచి తిరిగి అక్కయ్యపాలెం దర్గాకు చేరుకోవడంతో చందనోత్సవం పూర్తయ్యింది. ఈ సందల్ ఊరేగింపులో ఫకీర్ మేళా, బ్యాండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తాజ్‌బాగ్ దర్గాలో గల హజరత్ తాజుద్దీన్ నిషానిపై సందల్ పూసి, చాదర్ (పవిత్ర వస్త్రం) వేసి, గులాబీ పువ్వులు సమర్పించారు. అనంతరం ఫాతేహా, సలాతు సలాం వంటి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ప్రసాద వితరణ చేశారు.

పోరాటయోధుడు దాశరథి



మాట్లాడుతున్న సాహితీ విశ్లేషకుడు డాక్టర్ డీవీ సూర్యారావు

సీతంపేట: తెలంగాణ ఉద్యమ కవి, దివంగత దాశరథి కృష్ణమాచార్య శత జయంత్యుత్సవ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఘనంగా జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, విశ్లేషకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు సభాధ్యక్షత వహించారు. గత ఏడాది ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరిగిన దాశరథి ఉత్సవాలను గుర్తుచేసుకుంటూ తెలంగాణ కవి అయినప్పటికీ దాశరథి తెలుగు తల్లిని ప్రస్తావించిన వైనాన్ని కొనియాడారు. ప్రముఖ సాహితీ విశ్లేషకులు డాక్టర్ డీవీ సూర్యారావు దాశరథి ఉద్యమ సాహిత్యంపై లోతైన విశ్లేషణ చేశారు. 'ఆ చల్లని సముద్ర గర్భం' పద్యంతో ప్రారంభించి, దాశరథి రచనలన్నింటినీ స్పృశించారు. కవికి ప్రాంతీయ భేదం ఉండదని ఉద్ఘాటించిన ఆయన, దాశరథిని ఒక సమాజవాది, పోరాటయోధుడిగా అభివర్ణించారు. 'దాశరథి ఒక శాంతి విప్లవం. జైల్లో ఉండి కూడా కవిత్వం మరువని మహోన్నత సాహితీవేత్త' అని ప్రశంసించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న దాశరథి ప్రఖ్యాత వాక్యాన్ని సోదాహరణంగా వివరించారు. రైతుల గురించి దాశరథి కవిత్వాన్ని వివరిస్తూ, ఆయన 'దిగిపో' అని గర్జించిన ధైర్యశాలి అని, తిమిరంతో సమరం చేసిన మహాకవి అని విశ్లేషించారు. ప్రఖ్యాత వ్యాఖ్యాత రాంభట్ల నృశింహశర్మ దాశరథి రాసిన చలన చిత్ర గీతాలపై మాట్లాడారు. 'ఆ రజనీకర బింబం' పాటతో తన ప్రసంగాన్ని ప్రారంభించి, 'గరళము నుంచి సరళమునకు సాహిత్యాన్ని దించిన కవి దాశరథి' అని అభివర్ణించారు. . అరసం ఉపాధ్యక్షుడు ఎస్. హనుమంతరావు మాట్లాడుతూ దాశరథి కవిత్వంలో మానవతా కేతనం ఎగురుతుందని గుర్తుచేశారు.

ప్రజా ప్రయోజనాలకు పెద్దపీట



ప్రభుత్వ పథకాలను మహిళలకు వివరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

గాజువాక: ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 70వ వార్డు డ్రైవర్స్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యూనీఫాంలు ఇవ్వాలని వినతి : ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ప్లస్ టు చదువుతున్న విద్యార్థులకు ఉచిత యూనీఫారాలు ఇవ్వాలని పలువురు కార్పొరేటర్లు రాష్ట్ర మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కాకి గోవిందరెడ్డి, గంధం శ్రీనివాసరావు, బొడ్డు నర్సింహపాత్రుడు, రౌతు శ్రీనివాసరావు ఉన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలకు చెక్



కాంట్రాక్ట్ కార్మికుడికి బహుమతి అందజేస్తున్న విభాగాధిపతి రవికుమార్

ఉక్కునగరం: ఎత్తైన ప్రదేశాల నుంచి కింద పడడం వల్ల ప్రాణాంతక గాయాలు అవుతాయని స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి పి. రవికుమార్ అన్నారు. ఎస్టీఈడీ విభాగం ఇంజినీరింగ్ ఇన్‌చార్జి, జోనల్ సేఫ్టీ ఆఫీసర్ బయ్యే మల్లయ్య ఆధ్వర్యంలో హైట్ వర్క్స్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ అనే అంశంపై మంగళవారం కాంట్రాక్ట్ కార్మికులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మల్లయ్య మాట్లాడుతూ ఇండియన్ లేబర్ బ్యూరో 2015 రిపోర్ట్‌లో ప్రాణాంతక గాయాలకు కారణాలు వివరించారన్నారు. ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు, భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. తమ విభాగం అలాంటి జాగ్రత్తలు తీసుకోవడంలో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సాయి ప్రసాద్, ఎరిక్ టిర్కీ, తదితరులు పాల్గొన్నారు.

చిన్న వర్షానికే చిత్తడి



పెంటమాంబ ఆలయ సమీపంలో చిత్తడిగా మారిన రహదారి

పెదగంట్యాడ: మండలంలో మంగళవారం కురిసిన చిన్న వర్షానికే పలు ప్రాంతాల్లో రోడ్లు చిత్తడిగా మారాయి. ఫలితంగా రోడ్లపై ప్రయాణించిన వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడ బురదలో జారి పడతామో అని భయం భయంగా విధులకు, పాఠశాలలకు వెళ్లారు. అధికారుల నిర్లక్ష్యంతో వర్షాకాలంలో అవస్థలు పడక తప్పడం లేదని స్థానికులు వాపోయారు. నాయకులు చొరవ తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.